# సాక్షి
## రాజన్న సిరిసిల్ల

గురువారం ‌। 30 ‌। నవంబర్ ‌। 2023






### ఆదర్శ పోలింగ్ కేంద్రం
బోయినపల్లి: వెంకట్రావుపల్లి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఆదర్శ పోలింగ్ కేంద్రం -204గా ఎంపికచేశారు. ఈమేరకు అందంగా అలంకరించారు.



### ఘనంగా అయ్యప్ప పడిపూజ
ధర్మపురి: అయ్యప్పస్వామి ఆలయం 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆరట్టు, పడి పూజ ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
31.0/21.0

### వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఈ గుర్తింపుకార్డులతో ఓటేయండి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల: జిల్లాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 12 రకాల గుర్తింపుకార్డులను భారత ఎన్నికల సంఘం అనుమతించిందని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. నేడు జరిగే ఎన్నికల్లో ఓటర్లకు ఓటరు గుర్తింపుకార్డు లేకున్నా.. మరో 12 రకాల గుర్తింపుకార్డుల్లో ఏదో ఒక్కటి ఉంటే చాలని స్పష్టం చేశారు.

**గుర్తింపుకార్డులు ఇవే..**
ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, తపాలా ఆఫీస్ జారీచేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, కార్మికమంత్రిత్వశాఖ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, భారతీయ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ మంజూరుపత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ గుర్తింపుకార్డు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డు, దివ్యాంగుల యూనిక్ డిజేబుల్ గుర్తింపుకార్డు (యూడీఐడీ).. ఇందులో ఏదో ఒక్కటి గుర్తింపుకార్డుతో ఓటుహక్కు వినియోగించుకోవచ్చని వివరించారు.

### 230 కేసులు.. 219 మంది బైండోవర్



సీఐ చంద్రశేఖర్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో ఈ ఎన్నికల సమయంలో 230 కేసులు నమోదుచేసి 219 మందిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా, సేవించే ప్రాంతాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు వివరించారు. నాటుసారా తయారీ ముడిపదార్థాలు బెల్లం, పటిక అమ్మేవారిని బైండోవర్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు 230 కేసులు నమోదు చేసి, 59,269 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. 73 లీటర్ల నాటుసారా, 198 లీటర్ల మద్యం, 231 లీటర్ల బీర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. 277 కిలోల బెల్లం, రెండు ఆటోలు, ఐదు బైక్‌లను పట్టుకున్నట్లు వివరించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి వరకు సంబంధిత తహసీల్దార్ల ముందు 219 మందిని బైండోవర్లు చేశామని సీఐ వివరించారు.

### అభివృద్ధిని చూసి ఓటేయండి
- వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: వేములవాడ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని, రానున్న రెండేళ్లలో రాజన్నగుడి, బద్దిపోచమ్మ గుడి, వేములవాడ పట్టణం అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. బుధవారం సాక్షితో మాట్లాడారు. గురువారం జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును ప్రజాస్వామ్య పద్ధతిలో ఉపయోగించుకోవాలని కోరారు. కలికోట సూరమ్మ చెరువు, ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీటి సౌకర్యం కల్పించబోతున్నామన్నారు. పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు మెరుగు పరుస్తామన్నారు.

### ఒక్క అవకాశమివ్వండి
- వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్




ఓటర్లు, పార్టీ కార్యకర్తలతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: ఈసారి ఒక్క అవకాశమివ్వండి.. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. తన ఆఫీస్ నుంచి బుధవారం ఫోన్‌లో పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. నాలుగుసార్లు ఓడినా కుంగిపోకుండా ప్రజలకు అందుబాటులో ఉన్నానని.. తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానికంగా ఉంటూ ఎప్పుడు ఆపద వచ్చినా అండగా నిలిచిన తనకు ఈసారి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆరు గ్యారంటీల అమలు బాధ్యత తనదేనన్నారు.

# ఓటుకు వేళాయె

## వజ్రాయుధం.. వినియోగించేది నేడే

- ప్రజలందరూ ఓటు వేయాలి
- ఉమ్మడి జిల్లాలో పోలింగ్‌కు పూర్తయిన ఏర్పాట్లు
- 216 మంది అభ్యర్థులు
- 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు







ఈవీఎం, పోలింగ్ సామగ్రితో కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రితో సిబ్బంది



ఈవీఎంలను తీసుకొస్తున్న పంచాయతీ కార్మికులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పౌరహక్కుల్లో మొదటిస్థానంలో నిలిచేది ఓటుహక్కు. దీన్ని ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, సీపీ/ఎస్పీలు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. మంథని వంటి సమస్యాత్మక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకే ముగియనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో గరిష్టంగా కరీంనగర్‌లో 289, కనిష్టంగా సిరిసిల్లలో 77 ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఎలాంటి అలజడులకు తావులేకుండా ముందు జాగ్రత్తగా అదనపు బలగాలను మోహరించారు. నాలుగు జిల్లాల్లో కలిపి, 13,872 మంది పోలీసులకు విధులు కేటాయించారు. ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీలతోపాటు ఏఐఎఫ్‌బీ వంటి చిన్న పార్టీలు, ఇండిపెండెంట్లు కలిపి మొత్తం 216 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. వీరందరి రాజకీయ భవితవ్యం తేల్చేందుకు ఓటర్లు గురువారం ఓటేయనున్నారు. ఇందుకోసం అధికారులు 3,417 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సొంతూరులో ఓటేసేందుకు హైదరాబాద్, ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి కూడా మాతృభూమికి ఓటర్లు తరలి వస్తుండటం విశేషం.

### ఓటర్లు ఇవి పాటించాలి..
- మీ ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకునేందుకు ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్ లేదా సీ-విజిల్ యాప్ వినియోగించుకోవచ్చు.
- ఓటు వేసేందుకు వెళ్లినపుడు పోలింగ్ కేంద్రం దగ్గర పార్టీల గుర్తులు, రంగులు కలిగిన దుస్తులు, టోపీల వంటివి ధరించకూడదు.
- బూత్ లోపలికి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదు.
- ఒకవేళ జాబితాలో పేరు ఉండి, ఓటరు కార్డు లేకపోతే ప్రభుత్వం సూచించిన ఆధార్, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పెన్షన్, బ్యాంక్ ఖాతా పుస్తకం, ఉపాధి హామీ కార్డు తదితర 12 రకాల కార్డుల్లో ఏదో ఒకటి చూపించాలి.
- ఈవీఎం బటన్ నొక్కిన తర్వాత మీరు ఓటేసిన గుర్తు అక్కడి తెరపై ఏడు సెకన్లపాటు కనిపిస్తుంది. అలా మీ ఓటుని నిర్ధారించుకోవచ్చు.
- ఓటు వేయడంలో ఏవైనా ఇబ్బందులున్నా, మీ ఓటు మరొకరు వేసినా.. వెంటనే పోలింగ్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.
- ఒక్కసారి పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాక ఓటు వేసేందుకు ఎంత సమయమైనా అధికారులు మీ ఓటు తప్పకుండా తీసుకుంటారు.

### గత పోలింగ్ శాతం దాటేనా?
2018 ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ పోలింగ్ జరిగింది. కరీంనగర్‌లో 69.29, చొప్పదండిలో 79.73, మానకొండూరులో 85.36, హుజూరాబాద్‌లో 84.40, హుస్నాబాద్‌లో 83.97, కోరుట్లలో 75.84, జగిత్యాలలో 78.83, ధర్మపురిలో 80.19, రామగుండంలో 71.94, మంథనిలో 85.41, పెద్దపల్లిలో 84.08, వేములవాడలో 80.62, సిరిసిల్లలో 80.88 శాతం పోలింగ్ నమోదైంది. ఆయా నియోజకవర్గాలను పరిశీలిస్తే కరీంనగర్‌లో అత్యల్పం, మంథనిలో అత్యధికం. కరోనా తర్వాత స్మార్ట్‌ఫోన్లు, డేటా వినియోగం పెరిగింది. దీంతో ప్రభుత్వం ఎన్నికలు, ఓటుహక్కు వినియోగంపై చేసిన ప్రచారం కారణంగా గతంతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెరుగుతుందని అధికారులు ధీమాగా ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాలు..**
కరీంనగర్‌లో 390, చొప్పదండిలో 327, మానకొండూరులో 316, హుజూరాబాద్‌లో 305, రామగుండంలో 259, మంథనిలో 288, పెద్దపల్లిలో 290, వేములవాడలో 170, సిరిసిల్లలో 287, కోరుట్లలో 262, జగిత్యాలలో 254, ధర్మపురిలో 269 మొత్తం 3,417 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.



ఈవీఎం, వీవీప్యాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సిబ్బంది

### పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది వివరాలు

| జిల్లా | సమస్యాత్మక కేంద్రాలు | పోలింగ్ సిబ్బంది | పోలీసులు | ఫోన్ నంబర్ |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 289 | 4,872 | 5,020 | 8500666768 |
| జగిత్యాల | 248 | 4,616 | 3,000 | 7995084601 |
| పెద్దపల్లి | 115 | 3,352 | 4,202 | 7995070700 |
| రాజన్నసిరిసిల్ల | 77 | 3,542 | 1,650 | 9849905881 |



ఎన్నికల సామగ్రితో సిబ్బంది



పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

## మనసు ఊరుకోలేఖ..

సిరిసిల్ల: కాలం కరిగిపోతోంది.. మరో అయిదేళ్లు మనల్ని పాలించే ప్రతినిధులను ఎన్నుకునే రోజు రానే వచ్చింది. నేడు(గురువారం–నవంబర్ 30) ఓట్ల పండుగ. ఈ ఒక్కరోజు ఓటరుగా మీరు రాజు. నిస్వార్థ ప్రజాసేవకుడిని ఎన్నుకోండి. మా గుర్తుకు ఓటేయండి అంటూ ఎన్నికల్లో పోటీ చేసేవారంతా మైకు.. ఎల్ఈడీ స్క్రీన్లు పెట్టి మరీ చెప్పారు. చేసిన అభివృద్ధి.. చేస్తామన్న పనులు వివరించారు. ఓటర్ల చుట్టూ చేరి, చేతులు జోడించి ఓటు అడిగారు. కాళ్లు మొక్కుతామన్నారు. మీరు గెలిపించకపోతే ప్రాణాలు తీసుకుంటామన్నారు. అయిదేళ్లకోసారి వచ్చే అరుదైన అవకాశం ఇదే.. లే.. లే.. నిర్లక్ష్యాన్ని వీడు. పోలింగ్ స్టేషన్ వైపు నడువు. ఓటనే వజ్రాయుధాన్ని సంధించు. నీ ఓటు మంచి పాలనకు బాట కావాలి. స్వార్థపరులకు వేటవ్వాలి. వంగి వంగి దండాలు పెట్టిన నేతలంతా మట్టి కరవాలి. ఎన్నికల వేళ నీ ఓటు ఎంత అమూల్యమైందో గుర్తించు. మన తలరాతలను మార్చే మంచి లీడర్‌కు ఓటెయ్యి. ఎన్నికల రోజు కావడంతో నా మనసు ఊరుకోలేక ఇదంతా చెబుతున్నా.. ఇంతకూ నేనెవరో మీకు చెప్పనే లేదు కదా.. మిమ్మల్ని కన్న మీ పల్లె తల్లిని. మీ క్షేమం.. నా అభివృద్ధిని కాంక్షిస్తూ ఓ మంచి మాట చెబుదామని మీ ముందుకొచ్చిన. ఒక్కసారి నా మొర ఆలకించండి.

- అరచేతిలో వైకుంఠం చూపించే మాటల గారడీ నేతలను నమ్మకండి. మనీకో, మద్యం సీసాకో విలువైన మీ ఓటు అమ్మకండి. అందుకే చెబుతున్నా... తస్మాత్ జాగ్రత్త. ఏవేవో ఇస్తామని ఆశలు పెడుతున్రు. కులం, ప్రాంతం, ప్రగతి పాఠాలను బోధిస్తూ మీ ముందుకొచ్చిన నాయకుల అసలు రూపం గమనించండి. లోతుపాతుల్ని.. ఆ మాటల వెనక ఉన్న నయవంచన గుర్తించండి. మీ ఓటుతో ఎందరో గద్దెనెక్కి రాజ్యమేలారు. మీకు, మీ అందరికీ నీడనిచ్చిన నాకు జరిగింది ఏమిటి? ఒక్కసారి మనసు పెట్టి, ఆలోచించండి. ఎన్నికల్లో ఎన్నెన్నో హామీలిచ్చి గెలిచాక ఒక్కసారైనా మీ ముఖం చూడని వారిని గెలిపించాల్నా? మన నియోజకవర్గ సమస్యల్ని, మన బాధలను పట్టించుకోకుండా కాంట్రాక్టులు చేసి, సంపాదించుకునేవారు.. కమీషన్లు దండుకునే వారిని గెలిపించుకోవాల్నా? ఏదైనా పని పడి నేతల మద్దతుకు పోతే ఇంటి గేటవుతల నిలబెట్టే లీడర్లను గెలిపించాల్నా? తెలుసుకోండి. దండం పెట్టాడని ఓటేస్తే.. మళ్లీ అయిదేళ్ల వరకు కనిపించరు. గతంలో రాజ్యమేలిన నేతలు ఏం చేశారో ఆలోచించండి. అధికారంలో ఉన్నప్పుడు ఏం చేయనోడు.. రేపు చేస్తానంటే నమ్మేదెలా? ఏ పార్టీ వాడన్నది ముఖ్యం కాదు.. ఏపాటివాడో చూడండి. వ్యవసాయం పండుగలా సాగాలి.. చదువుకున్న వారికి ఉద్యోగాలు రావాలి.. ఉన్న ఊర్లో ఉపాధి దొరకాలి.. గల్ఫ్ దేశాలకు బతకవోయే వారి బాధలు పోవాలి. నల్లసూరీళ్ల బతుకుల్లో వెలుగులు నిండాలి. అన్ని కులాలు, మతాలకు భరోసా కావాలి. ఆత్మగౌరవంతో బతికేలా ఉండాలి. మీ, నా సంక్షేమాన్ని చూసుకునే మంచి నేతలు అందలమెక్కాలి. లే..లే.. చలికాలమని లేవడానికి ఇబ్బంది పడకు.. పోలింగ్ కేంద్రానికి వెళ్లకుండా.. ఓటు వేయకుండా ఉండొద్దు. నీతిమంతులకు పట్టం కడితే నువ్వు, నేను బాగుపడతాం. మీ అంతరాత్మ సాక్షిగా ఓటేయండి. నమస్తే.. ఇక ఉంటాను.

– మీ అందరి క్షేమం కోరే మీ ఊరు

### ఆర్టీసీ సిబ్బందికి అవార్డులు



అవార్డులు అందిస్తున్న ఆర్ఎం మనోహర్

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ అందిస్తున్న 'ప్రగతిచక్రం' అవార్డులలో భాగంగా సిరిసిల్ల డిపో కరీంనగర్ రీజియన్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఈమేరకు సిరిసిల్ల డిపో సిబ్బందికి బుధవారం రీజినల్ మేనేజర్ వి.సుచరిత చేతుల మీదుగా ప్రగతిచక్రం అవార్డులను అందించారు. డీఎం మనోహర్, డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, భూపతిరెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు : ఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని మండెపల్లి పోలింగ్ కేంద్రాన్ని బుధవారం రాత్రి ఎస్పీ అఖిల్ మహాజన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్లను పరిశీలించి పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. తంగళ్లపల్లి ఎంపీడీవో పి.లచ్చాలు, పంచాయతీ కార్యదర్శి రఘువీరారెడ్డి, పోలీస్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

## రిసెప్షన్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు చేయాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఓటింగ్ ముగిసిన అనంతరం ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరిచే బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి స్వీకరణకు రిసెప్షన్ కేంద్రాలను పక్కాగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. మండలంలోని బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంను గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులతో రిసెప్షన్ కేంద్రాలను ఏర్పా టు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానా యక్, గౌతమ్ రెడ్డి, రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, డీపీవో రవీందర్ ఉన్నారు.

## మాక్ పోలింగ్ విధిగా నిర్వహించాలి
- ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభించాలి
- సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్



ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో మాట్లాడుతున్న పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్

సిరిసిల్ల/వేములవాడ: అన్ని పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్‌ను విధిగా నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్ కోరారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. జగదీశ్ సోన్‌కర్ మాట్లాడుతూ గురువారం తెల్లవారుజామున 5 గంటలకే మాక్‌పోలింగ్ నిర్వహించాలని, 7 గంటల నుంచి ఓటర్లను అనుమతించి ఓట్లు వేయించాలని సూచించారు. ప్రతి రెండు గంటలకోసారి పోలింగ్‌శాతాన్ని నివేదించాలని స్పష్టం చేశారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే సెక్టార్, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలని సూచించారు. పోలింగ్ ముగిసిన అనంతరం నిబంధనల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలన్నారు. ఎన్నికల పోలీస్ పరిశీలకురాలు వినీత సాహు, ఎన్నికల వ్యయ పరిశీలకులు జి.మణిగండసామి, రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**
తంగళ్లపల్లి మండలం రాళ్లపేటలోని పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, వినీత సాహు, మణిగండసామి బుధవారం రాత్రి పరిశీలించారు. పోలింగ్ రోజు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎన్నికల సిబ్బందికి సూచించారు.

**సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు..**
సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గ కేంద్రాల్లో ఎన్నికల సామగ్రి పంపిణీ బుధవారం కొనసాగింది. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ సామగ్రితో బస్సుల్లో వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సామగ్రిని పంపిణీ చేశారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లతో కేంద్రాలకు వెళ్లారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్‌లకు పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎన్నికల సామగ్రి పంపిణీ సవ్యంగా సాగింది.

## క్లుప్తంగా

### గుండెపోటుతో మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ మృతి


నారాయణగౌడ్ (ఫైల్)

జ్యోతినగర్: గుండెపోటుతో మున్సిపల్ సీనియర్ కాంట్రాక్టర్ గడ్డం(సుందిల్ల) నారాయణగౌడ్(59) బుధవారం మృతిచెందాడు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో నివసిస్తున్న రామగుండం మున్సిపల్ సీని యర్ కాంట్రాక్టర్ నారాయణగౌడ్ ఉదయం అస్వస్థతకు గురి కాగా.. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందించే లోపు మృతిచెందాడు. మృతుడికి భార్య విజయతో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. పలువురు కాంట్రాక్టర్లు, గౌడ సంఘం నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

### ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై కేసు

రాయికల్: పట్టణంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఓటర్లకు భోజనం ఏర్పాటు చేసిన సాయి క్యాటరింగ్ యజమాని అనుపురం చిన్న లింబాద్రి, పట్టణానికి చెందిన మ్యాకల కాంతారావుపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

### విద్యుదాఘాతంతో కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ మృతి



ఇబ్రహీంపట్నం: వేములకుర్తి గ్రామంలో కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆరె రాజ్‌కుమార్(45) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. తన కోళ్ల ఫారం వద్దకు ఉదయం వెళ్లాడు. విద్యుత్ సరాఫరా లేకపోవడంతో ఫారం వద్దున్న 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద టెస్టర్‌తో కరెంట్ సరాఫరా ఉందా లేదా అని టెస్టర్ ద్వారా పరిశీలించారు. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురున్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. రాజ్‌కుమార్ కొద్ది రోజుల క్రితం బీజేపీలో చేరి కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి అర్వింద్‌కు మద్దతుగా కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, నిజామాబాద్ ఎంపీ, బీజేపీ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు వేరువేరుగా నివాళి అర్పించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు.

### గల్ఫ్ బాధితుడి వైద్యానికి రూ.1.32 లక్షల సాయం

ధర్మపురి:కుటుంబపోషణ భారం కావడంతో దుబాయికి వెళ్లిన ఓ కార్మికుడు అక్కడా ఉపాధి లేక తిరిగి వచ్చాడు. రాగానే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. దీంతో కాలు, చేయి పడిపోయింది. ఆయన వైద్య ఖర్చుల కోసం సామాజిక మిత్రులు రూ.1.32 లక్షలు సాయం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ధర్మపురి మండలకేంద్రంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేశ్‌కు భార్య, కూతురు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం ఆర్నెల్ల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ సరిగా పని దొరక్కపోవడంతో స్వగ్రామానికి వచ్చాడు. నాలుగు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురి కాగా కాలు, చేయి పడిపోయి మంచానికే పరిమితమయ్యాడు. అప్పు చేసి వైద్యం చేయిస్తున్నా పూర్తిగా నయం కావడంలేదు. డబ్బులు లేకపోవడంతో వైద్య సేవలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఆయన దీనస్థితిని తెలుసుకున్న ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ ఈనెల 4న ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసి సాయం అందించాలని కోరారు. స్పందించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు రూ.1.32లక్షలను సురేశ్ భార్య రాణి బ్యాంకు ఖాతాకు పంపించారు. ఆ మొత్తాన్ని రమేశ్ బుధవారం స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ రవితేజ చేతులమీదుగా సురేశ్ భార్యకు అందించారు.



# పోలింగ్‌పై నిఘా


ఎన్నికల విధులపై సూచనలు ఇస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- జిల్లాలో 650 పోలింగ్ కేంద్రాలు
- 77 సమస్యాత్మకం
- 1,700 మందితో బందోబస్తు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో గురువారం నిర్వహించే అసెంబ్లీ ఎన్నికలపై పోలీస్ నిఘా ఉంది. జిల్లా వ్యాప్తంగా 650 పోలింగ్ కేంద్రాలు ఉండగా 77 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 1,700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలుచేస్తున్నారు.

### పోలీసు బాస్ దిశానిర్దేశం

జిల్లా కేంద్రంలోని కాలేజ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఈవీఎం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బందోబస్తు విధులపై అవగాహన కల్పించారు. రూట్ బందోబస్తు, పోలింగ్ స్టేషన్ బందోబస్తు, పెట్రోలింగ్ పార్టీల విధులు వివరించారు.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యం. ఎన్నికలకు పటిష్ట బందోబస్తు చేపడుతున్నాం. ముందుగానే 144 సెక్షన్ అమలుచేస్తున్నాం. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలి.
– అఖిల్ మహాజన్, ఎస్పీ

### భద్రత ఏర్పాట్లు

జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల పరిధిలో 1,700 మందితో బందోబస్తు చేపడుతున్నారు. ఎస్పీ ఒకరు, ఏఎస్పీ ఒకరు, డీఎస్పీలు 5, ఇన్‌స్పెక్టర్లు 16, ఎస్సైలు 34, జిల్లా సిబ్బంది 700, కేంద్ర బలగాలు 480, బెటాలియన్ సిబ్బంది 42, ఆర్‌పీఎఫ్ సిబ్బంది 52, మహారాష్ట్రకు చెందిన హోమ్‌గార్డ్స్ 450 మంది బందోబస్తు విధుల్లో ఉంటున్నారు. వీరికి అదనంగా రూట్ మొబైల్స్ 53, క్విక్ రియాక్షన్ టీమ్స్ 13, స్ట్రైకింగ్ ఫోర్స్ 13, స్పెషల్ స్ట్రైకింగ్ రెండు బృందాలను ఏర్పాటు చేశారు.

# బాండ్ పేపర్ నేతల భవితవ్యం మార్చేనా?


రాణి రుద్రమ హామీపత్రం


ఆది శ్రీనివాస్ ఇచ్చిన హామీపత్రం

- వేములవాడలో 'ఆది'
- సిరిసిల్లలో 'రుద్రమ'
- హామీపత్రాలపై జోరుగా చర్చ

సిరిసిల్లక్రైం: ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు కొంత పుంతలు తొక్కుతున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని ఇద్దరు అభ్యర్థులు వారు గెలిస్తే ఏం చేస్తామన్న దాన్ని ప్రజలకు బాండ్‌పేపర్ మీద రాసి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. ఇలాంటి విధానాన్ని నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో గతంతో బీజేపీ అభ్యర్థి అర్వింద్ అవలంబించి విజయాన్ని సాధించారు. అంతేకాదు తాను రాసిచ్చి దాన్ని నెరవేర్చడానికి శతవిధాలా ప్రయత్నించి వాటిని నెరవేర్చిన విషయం విదితమే. ఇదే విధానాన్ని ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ బాండ్‌పేపర్‌లు రాసి ప్రకటించారు. బాండ్‌పేపర్ హామీపత్రం నేతల భవితవ్యంపై నిర్ణయిస్తుందా?లేదా? వేచి చూడాల్సిందే..

# గందరగోళంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగం

- ఎన్నికల అధికారులతో ఉపాధ్యాయ ఓటర్ల వాగ్వాదం
- ఎట్టకేలకు ముగిసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్


అధికారితో ఉపాధ్యాయుల వాగ్వాదం

పెద్దపల్లిరూరల్: పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఈసారి ఎన్నికల్లో కొంత గందరగోళానికి దారి తీసింది. పోస్టల్ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు తమకు ఓటేసే అవకాశం ఎందుకు ఇవ్వడం లేదంటూ ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్‌లో తమ పేర్లు ఎందుకు లేవని, తాము చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయో చెప్పాలంటూ ధర్మారం మండలానికి చెందిన కొందరు ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులతో వాదనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని శాంతింపజేశారు. అయితే ఉపాధ్యాయుల సొంత గ్రామం ఓ నియోజకవర్గం.. పని చేసే ప్రాంతం మరోచోట.. ఎన్నికల విధులు నిర్వహించేది మరోటి కావడం వల్లే ఎన్నికల అధికారుల సమన్వయ లోపంతోనే ఇలా జరిగిందని ఓ అధికారి పేర్కొన్నారు. అయితే వీలైనంత మేర మళ్లీ ఉపాధ్యాయుల నుంచి ఫారం12డీ తీసుకొని ఓటు హక్కును కల్పించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని కేంద్రంలో 1,117 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకున్నట్లు అధికారులు వివరించారు.

### గడువు పెంచాలని డిమాండ్

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు గడువు పెంచాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు అశోక్‌రెడ్డి, రాంకిషన్‌రావు, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం 15రోజుల క్రితమే దరఖాస్తు చేసుకున్నా.. ఓటు హక్కు వినియోగించుకోకుండా ఎందుకు చేశారన్నది అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిసెంబర్ 2 దాకా ఓటు వేసే అవకాశాన్ని ఇవ్వాలన్నారు.

# కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాకారం


సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్‌లో బీఆర్‌ఎస్ నాయకులు

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు
- సిరిసిల్లలో దీక్షాదివస్

సిరిసిల్ల: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2009లో ఉద్యమనేత కె.చంద్రశేఖర్‌రావు చేపట్టిన దీక్షతోనే కేంద్రం దిగొచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు పేర్కొన్నారు. సిరిసిల్ల తెలంగాణభవన్‌లో బుధవారం దీక్షాదివస్‌ను నిర్వహించారు. తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళి అర్పించి సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నర్సింగరావు మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ ప్రజల గోసను పోగొట్టేందుకు, సమైక్య పాలకుల కుట్రలను భగ్నం చేస్తూ కేసీఆర్ 2001లో ఉద్యమించారని గుర్తు చేశారు. 2009 నవంబర్ 29న సీఎం కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే కేంద్రం కదిలివచ్చి డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ప్రకటన చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో తెలంగాణ సబ్బండ వర్గాలు భాగస్వామ్యమయ్యాయని పేర్కొన్నారు. అమరుల పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాకారమైందన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్‌ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, మ్యాన రవి, వెంగల శ్రీని వాస్, సత్తార్, అన్నారం శ్రీనివాస్, మహమూద్, సామల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాలా.. రూ.50 కోట్లు

- ప్రచారంలో మహిళా సంఘాల హవా
- గల్లీ నుంచి ఢిల్లీ పెద్దల సభల దాకా..
- సభల విజయవంతంలో కీలక పాత్ర


ఓ సభలో పాల్గొన్న మహిళలు

కోరుట్ల: గల్లీ నుంచి ఢిల్లీ పెద్దల దాకా ఏ సభ చూసినా మహిళా సంఘాలదే హవా. ప్రధాన పార్టీల ప్రచార పర్వంలో ఈ ఎన్నికల్లో మహిళా సంఘాల పాత్ర కీలకంగా మారింది. క్షేత్రస్థాయిలో మహిళలు లేకుండా ఏ సభ సక్సెస్ కాలేదంటే అతిశయోక్తి కాదు. కీలక నేతల సభలకే కాదు.. ఇంటింటికి తిరిగి పార్టీలకు ప్రచారం చేయడంలోనూ మహిళా సంఘాల సభ్యులు హుషారుగా పాల్గొన్నారు. జగిత్యాల జిల్లాలోనూ ప్రధాన పార్టీల ప్రచార పర్వంలో ఇదే సీన్ కనిపించింది. ఎన్నికల ప్రచార పర్వం ముగిసినా.. పోలింగ్ ఏజంట్లుగా, పోలింగ్ బూతుల ముందు ప్రచారంలోనూ వీరిదే కీలక పాత్ర కానుంది.

### రూటు మార్చిన పార్టీలు

గతంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీల కార్యకర్తలు, నాయకులతోనే జరిగిన ప్రచారం.. ఈసారి మహిళా సంఘాల సభ్యులతోనే ఉరుకులు.. పరుగులు పెట్టిందనడంలో సందేహం లేదు. మహిళా సంఘాలను ప్రచారంలో దించడానికి, సభలు, సమావేశాలకు తరలించడానికి ప్రధాన పార్టీలిచ్చిన డబ్బులు కీలకంగా పని చేశాయన్న అంశం బహిరంగ రహస్యంగా మారింది. ఈ విషయంలో ఏ పార్టీ ఇంకొకరికి తీసిపోలేదు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి సెగ్మెంట్లలోని మొత్తం ఓటర్లలో మహిళల ఓట్లు సుమారుగా 4,59,000 ఉన్నాయి. మొత్తం మహిళా ఓటర్లలో దాదాపుగా 80 శాతం వరకు మహిళా సంఘాలు, పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారు. ఆయా సంఘాల లీడర్ల ఆసరాతో సంఘంలోని సభ్యులకు సభలు, ప్రచారాలకు పార్టీల తీరుననుసరించి ఒక్కో మహిళకు రోజుకు రూ.100–300 వరకిచ్చారు. జిల్లాలోని కొన్నిచోట్ల కీలక నేతల ప్రచార సభలకు మహిళా సంఘాల లీడర్లు తమను పిలవలేదని సభ్యులు కొంతమంది లీడర్ల తీరుపై మండిపడ్డ సంఘటనలున్నాయి. కొన్నిచోట్ల ఇలాంటి గొడవలు బాహాటంగా జరిగి రచ్చకెక్కాయి.

### రూ.50 కోట్ల పైమాటే..

పది రోజులుగా జగిత్యాల జిల్లాలోని మూడు సెగ్మెంట్లలోనూ ప్రచార పర్వం ఊపందుకుంది. ఈ క్రమంలో ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల సెగ్మెంట్లలోని పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి తమతమ పార్టీల ప్రచారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సభలన్నింటిలోనూ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ పది రోజుల ప్రచారంలో జగిత్యాల జిల్లాలోని మొత్తం 4.50 లక్షల మంది మహిళా ఓటర్లలో ఎంత తక్కువ అనుకున్నా 3.20 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా. పది రోజులుగా వీరికి ఒక్కొక్కరికి రోజుకు రూ.200 చొప్పున ప్రచారం కోసం దక్కినట్లు సమాచారం. ఒక్కోరోజు ఒకే మహిళా సంఘాల సభ్యులు రెండు, మూడు పార్టీల ప్రచారాల్లోనూ పాల్గొన్న సంఘటనలున్నాయి. ఈ లెక్కన ఈ పది రోజులుగా ఒక్కొక్కరికి రూ.1,500 నుంచి రూ.2వేల వరకు గిట్టుబాటయినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లెక్కన ఎంత తక్కువ అనుకున్నా ప్రచార పర్వంలో రూ.50 కోట్ల వరకు ఖర్చు జరిగినట్లు తెలుస్తోంది.

# ప్లీజ్.. నన్ను అమ్ముకోకండి

- ఓటు అంతర్మథనం

రాయికల్(జగిత్యాల): ఓటరు మహాశయులారా.. నాదో విన్నపం. ఐదేళ్లకోసారి నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లోనే నేనే ప్రధాన పాత్రధారి. అలాంటి నన్ను అన్ని రాజకీయపార్టీలు తమ అవసరాలకు వాడుకుంటున్నాయి. నా విలువను రూ.500 నుంచి రూ.2 వేలు.. ఆపైనా కూడా నిర్ధారిస్తున్నారు. ఇది ఎంతవరకు సమంజసం. నా విలువను వెలకట్టేవాళ్లు రేపు నీకేమన్నయితే గుర్తు చేసుకుంటారా? ప్రతిరోజూ నా గుర్తుకే ఓటు వేయాలంటూ నీ చుట్టూ తిరుగుతున్నారు అన్ని పార్టీల నాయకులు. వారికి నీలో కనిపించేదే నేను. నీ చేతిలోని వజ్రాయుధాన్ని. ఐదేళ్లకోసారి నన్ను వినియోగించుకునే అవకాశాన్ని రాజ్యాంగం కల్పించింది. దానిని కొందరు నాయకులు ఎన్నికలు రాగానే వెలకడుతున్నారు. ఒక్కొక్కరు ఒకలా మార్చుకుంటున్నారు. కొందరు డబ్బులతో.. మరికొందరు మద్యంతో కొంటున్నారు. ఇది నాకెంతో బాధ కలిగిస్తోంది. నామీద పెట్టుబడి పెట్టి అమ్మేసిన వారు తీరా గెలిచాక మీ దగ్గర ముక్కుపిండి వివిధ పన్నుల రూపాల్లో వసూలు చేస్తారు జాగ్రత్త. ప్రజలకు మంచి చేసే నిజాయితీపరులకు ఉపయోగించు. ఎట్టి పరిస్థితుల్లోనూ నన్ను అమ్ముకోకండి. నిజాయితీపరుడైన నాయకుడిని.. ప్రజల కోసం పనిచేసే నాయకుడిని నా వజ్రాయుధంతో ఓటువేసి మంచి ఫలితాలు రాబట్టుకోండి. అంతేగాని దయచేసి నన్ను మాత్రం అమ్ముకోకండి ప్లీజ్.
– ఇట్లు మీ ఓటు

# పార్టీల ఎర.. ఖాకీల నిఘా


సిరిసిల్లలో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

### జిల్లా సమాచారం

| | |
|---|---|
| నియోజకవర్గాలు | : 02 |
| గ్రామాలు | : 255 |
| జిల్లాలో చెక్‌పోస్టులు | : 05 |
| పట్టుబడిన సొమ్ము | : రూ.92,37,745 |
| పట్టుబడిన గంజాయి | : 32.260 కిలోలు |
| పట్టుబడిన మద్యం | : 1,214.955 లీటర్లు |
| నోటీసులిచ్చిన సంఘాలు | : 75 |
| బైండోవర్ కేసులు | : 661 |
| బైండోవర్ అయిన వ్యక్తులు | : 1,634 |
| పట్టుబడిన ఇతర వస్తువుల విలువ | : రూ.1,53,035 |

### కోడ్ ఉల్లంఘించొద్దు



కోడ్ ఉల్లంఘన విధానాలను సీరియస్‌గా తీసుకుంటాం. ఇప్పటికే ప్రతి గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాం. అన్ని ఏరియాలపై నిఘా ఉంది. నిబంధనలు అతిక్రమించి కేసుల్లో ఇరుక్కోవద్దు. ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అందరూ సహకరించాలి. – అఖిల్ మహాజన్, ఎస్పీ

- పంపకాలపైనే ఆశలు
- దృష్టి సారించిన పోలీసులు
- కులసంఘాలకు తాయిలాలు
- నోటీసులు జారీ..

సిరిసిల్లక్రైం: ఎన్నడూ లేనంతగా ఈసారి అసెంబ్లీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ నెలకొంది. అన్ని పార్టీల అభ్యర్థులు తమ గెలుపు కోసం అన్ని విధాలా కృషి చేస్తున్నారు. ఆయా పార్టీల బడానేతలు బహిరంగసభలు, రోడ్‌షోలు నిర్వహించారు. పదిహేను రోజుల పాటు హోరాహోరీగా ప్రచారం చేసిన పార్టీ నాయకులు, అభ్యర్థులు చివరి రోజు తమ పంథా మార్చారు. కులసంఘాలు, మహిళా సంఘాల సభ్యులను చాటుమాటుగా కలుస్తూ ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. తాయిలాలు ఇచ్చి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలను పోలీస్ బలగాలు పసిగట్టి.. అడ్డుకునే ప్రయత్నాలు చేశాయి. పలు కులసంఘాల నాయకులు నోటీస్‌లు సైతం జారీ చేశారు. కులసంఘాల భవనాల్లో పార్టీల మీటింగ్‌లు పెట్టరాదని, భోజనాలు.. ఇతరత్ర ఏర్పాటు చేయరాదని నోటీస్‌లలో సూచించారు.

### పెద్దమనుషులదే పైచేయి..

ప్రచారానికి కావాల్సిన కార్యకర్తలను సమకూర్చడానికి పార్టీ అభ్యర్థులు ఆయా గ్రామాల్లోని పెద్దమనుషులను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లోని బడా నాయకులు, మహిళా సంఘాల లీడర్లతోపాటు కులసంఘాల్లోని ప్రముఖ వ్యక్తుల ద్వారా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. తమను గెలిపిస్తే కులసంఘాలకు కమ్యూనిటీ భవనాలు, కులదేవతల ఆలయాల అభివృద్ధికి అండగా ఉంటామని భరోసానిస్తూ ఓట్లను పొందేందుకు ప్రయత్నించారు.

### విజయావకాశాలపై చర్చ.. వివాదాలతో రచ్చ

జిల్లాలోని రెండు నియోజకవర్గాలు సిరిసిల్ల, వేములవాడ అభ్యర్థుల గెలుపోటములపై గ్రామాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మరికొందరు యువకులు ఇంకాస్త ముందుకెళ్లి తమ అభిమాన నాయకుడే గెలుస్తాడంటూ బెట్టింగ్‌లు కాస్తున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఈసారి ఎన్నికల్లో ప్రచారశైలిలో వాడీవేడి పెరిగింది. అభివృద్ధి మంత్రం ఒకరు జపిస్తుంటే.. అహంకార ధోరణి అంటూ ప్రత్యర్థి అభ్యర్థి విమర్శిస్తున్నారు. మరికొందరైతే వ్యక్తిగత దూషణలు చేస్తుండడం పల్లెల్లో కార్యకర్తల మధ్య పంచాయితీలకు దారితీస్తుంది.

### సోషల్ మీడియాపైనే దృష్టి

ఈసారి ఎన్నికల్లో సోషల్‌మీడియా గెలుపోటములపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈక్రమంలోనే అన్ని పార్టీల అభ్యర్థులు సోషల్‌మీడియా ప్రచారంపైన ప్రధానంగా దృష్టి సారించారు. గ్రామీణ యాస, భాషలను జోడించి ఓట్లను అభ్యర్థిస్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి. సోషల్ మీడియా వేదికగా సైతం కామెంట్స్ హాట్‌హాట్‌గా పెడుతుండడం చర్చకు దారితీసింది. ఇలాంటి వాటిపై పోలీసు లు పలువురు యువకులను ఇప్పటికే హెచ్చరించారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్లు, సోషల్‌మీడియా అకౌంట్ నిర్వహించే వారిని హెచ్చరించారు. అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామంటుని హెచ్చరించారు.

### పోలీసుల నిశిత దృష్టి

ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే మార్గాలను నియంత్రించేందుకు పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు. అక్రమంగా తరలించే మద్యం, డబ్బును పట్టుకునేందుకు తనిఖీలు చేపడుతున్నారు. ఒక వైపు చెక్‌పోస్టులు, మరో వైపు డైనమిక్ తనిఖీలతో ఎక్కడికక్కడ కట్టడి చేశారు. పోలింగ్‌కు ముందు రోజు బుధవారం రాత్రి ప్రలోభాలను అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిఘా తీవ్రతరం చేశారు.

# నకిలీ ఓటర్లకు 'చాలెంజ్'

సాక్షి, పెద్దపల్లి: చాలెంజ్ ఓటు అనేది ఓటు వేయడానికి కాదు.. అక్రమ ఓట్లను అడ్డుకోవడానికి ఉపయోగిస్తారు. ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు, పోలింగ్ ఏజెంట్.. అతడు నకిలీ ఓటరు అని గుర్తిస్తే ఆ విషయాన్ని ప్రిసైడింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్తారు. దానికి ఏజెంట్ తగిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడు పీవో ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తి గుర్తింపుకార్డులు, జాబితాలో పేరు తదితర వివరాలు సరిచూస్తారు. అవసరిగా ఉంటే ఓటుహక్కు కల్పిస్తారు. లేకపోతే ఎన్నికల ఏజెంట్ చెప్పినది నిజమని స్పష్టమైతే ఓటు వేయకుండా ఆ వ్యక్తిని అడ్డుకుని, చట్టంప్రకారం చర్యలు తీసుకుంటారు.

### టెండర్ ఓటు..

ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాక మనఓటు వేరేవారు వేసినట్లయితే.. అప్పుడు మనం టెండర్ ఓటు వేయవచ్చు. ముందుగా సదరు విషయాన్ని పీవోకు ఫిర్యాదు చేయాలి. అప్పుడు పీవో.. ఏజెంట్ల సమక్షంలో పరిశీలించి నిజమైతే ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. సదరు ఓటును ఈవీఎంలో కాకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయాల్సి ఉంటుంది. దాన్ని పీవో నమోదు చేసుకుంటారు. సదరు ఎన్నికల్లో అభ్యర్థులకు సమానంగా ఓట్లు వచ్చినప్పుడు ఆ ఓటును లెక్కిస్తారు.

### సెల్ఫీలు నిషేధం..

పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కు వినియోగించుకునే సమయంలో మొబైల్ ద్వారా సెల్ఫీలు తీసుకోవడం లేదా ఇతరులకు చూపించడం నిషేధం. ఒకవేళ అ లా చేస్తే 49ఎం (ఓటు రహస్యం) నిబంధన మేరకు ఆ ఓటరును బయటకు పంపిస్తారు. ఆ ఓటును నిబంధన 17ఎ లో నమోదు చేస్తారు. లెక్కింపు సమయంలో ఆ ఓటును పరిగణనలోకి తీసుకోరు.

### కరెక్టు వేశామో లేదో చూడవచ్చు

ఎన్నికల సంఘం ఈవీఎంలపై అనుమానాలు నివృత్తి చేసేందుకు, మనం వేసిన ఓటు ఏ అభ్యర్థికి వేశామో తెలుసుకునేందుకు అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా 2014 సార్వత్రిక ఎన్నికల్లో వీవీప్యాట్ (ఓటర్ వెరిఫయబుల్ ఆడిట్ ట్రయల్)ను ప్రవేశపెట్టింది. ఓటు వేశాక ఏడు సెకన్ల పాటు మనం ఓటు వేసిన అభ్యర్థి క్రమసంఖ్య, పేరు, గుర్తు ఉన్న పేపర్‌ను మనకు తెర పై చూపెడుతుంది. తర్వాత దానంతట అదే వీవీప్యాట్ బ్యాక్స్‌లో పడిపోతుంది. తెరపై కనిపించే గుర్తు సరిపోనిపక్షంలో పీఓకు ఫిర్యాదు చేయవచ్చు.